క్లుప్తంగా

మేలు చేసే భగవంతుని నామస్మరణ



భక్తులకు తత్వబోధ చేస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

రాంబిల్లి : భగవంతుని నామస్మరణతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తే అందరికీ మేలు జరుగుతుందని తపోవనం ఆశ్రమం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. పంచదార్లలో గల ద్విముఖ కల్యాణ వినాయక ఆలయంలో సోమవారం ఆయన భక్తులకు తత్వబోధ చేశారు. గ్రామాల్లో భజనలు, నగర సంకీర్తనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యాచరణ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



నాగవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక : పరిమితికి మించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. మండలంలోని నాగవరం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. ఓవర్ లోడుతో వెళ్తున్న మూడు టిప్పర్లను గుర్తించి రూ.లక్షా 92 వేల 910 అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రసాదరావు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : దార్లపూడి 32/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తలి, ఏటికొప్పాక ఫీడర్ల పరిధిలోని లైన్ల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం కొత్తలి, పేరంటాళ్లపాలెం, ములకలాపల్లి, మన్యంపాలెం, ఏటికొప్పాక గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యథేచ్ఛగా పేకాట

రాంబిల్లి : మండలంలో దిమిలి, కట్టుబోలు, గోకివాడ, అప్పన్నపాలెం, సెజ్ పరిశ్రమ ప్రదేశాల్లో పేకాటలు జరుగుతున్నాయి. దిమిలి సమీపంలోని పొలాల్లో రెండు రోజులుగా భారీ స్థాయిలో పేకాటలు జరుగుతున్నాయి. లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. అలాగే పలు గ్రామాల్లో కోడిపందాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పేకాట శిబిరాల వద్ద బైకులు, బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి అప్పులు తీసుకుని మరీ జూదం ఆడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 104 మంది ఎంపిక



వివిధ సంస్థలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో డాటాప్రో ఆధ్వర్యంలో డిషైన్ ప్రో, రెండ్స్నడ్, నవతా, అపోలో, ముత్తూట్ తదితర సంస్థలు శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఫైనల్ ఇయర్ బీఎస్సీ, బీకాం, బీబీఏ చదువుతున్న, పూర్తయిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో డిషైన్ ప్రో సంస్థకు 72, రెండ్స్నడ్‌కు 7, నవతాకు 5, అపోలోకు 7, ముత్తూట్‌కు 13 మంది, మొత్తం 104 మంది ఎంపికైనట్లు సహాయ కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిషైన్ కంపెనీ హెచ్‌ఆర్ డేవిడ్ సురేందర్, సంస్థల ఎగ్జిక్యూటివ్ ఎస్.సుధీర్, డి.వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

జనం మాట.. జగన్ బాట

- జోరుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ప్రచారం
- హారతులిచ్చి స్వాగతం పలికిన మహిళలు
- మంచి చేసిన జగన్‌బాబుకే మా ఓటు అని చెప్పిన ప్రజలు

మాకు మంచి చేసిన నాయకుడు, మా గురించి ఆలోచన చేసిన నేతను తామింత వరకు చూడలేదని.. ఇప్పుడు జగన్ బాబు వచ్చి తమ కష్టాలు తీరుస్తున్నాడని ఎన్నికల ప్రచారానికి పెనుగొల్లు, ధర్మవరం, లింగరాజుపాలెం గ్రామాలకు వెళ్లిన కంబాల జోగులుకు ప్రజలు తెలిపారు. తమకు మేలు చేసిన జగనన్ననే తాము గెలిపించుకుంటామని ముక్తకంఠంతో వెల్లడించారు. ప్రచారానికి తమ గ్రామాలకు వచ్చిన జోగులుకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు.



పి.ధర్మవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



ప్రచారంలో భాగంగా అవ్వ పక్కన కూర్చుని ఓటు అడుగుతున్న కంబాల జోగులు, వరుదు కల్యాణి

ఎస్.రాయవరం : జనమంతా సీఎం జగన్ వెంటే ఉన్నారని, పెత్తందారుల నుంచి తమను కాపాడేది జగన్‌మోహన్‌రెడ్డేనని వారు విశ్వసిస్తున్నారని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పెనుగొల్లు, ధర్మవరం, లింగరాజుపాలెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకి తిరిగిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టారు. మేమంతా జగన్‌బాబుకే ఓటు వేస్తాం.. ఆ బాబు వల్ల మా అందరికీ మంచి జరిగిందని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ క్రమంలో అవ్వాతాతలు, మహిళలు, రైతులను కలుసుకుంటూ ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ శివారు ప్రజలను కూడా కలుసుకుని ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పి.ధర్మవరం ప్రచారంలో పాయకరావుపేట పరిశీలకులు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఎమ్మెల్యే అభ్యర్థితో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదా కుమారి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, సర్పంచ్‌లు ఉద్దండం నాగ శ్రీదేవి, దూళి శ్రీనుబాబు, గాడి అప్పల నరసింహం, మైలపల్లి శ్రీనివాసరావు, శానాపతి శ్రీరాములు, పాలపర్తి పాపారావు, కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, వెదుళ్ల బంగారి, ఉద్దండం సూర్యనారాయణ, ఐవీ రత్నం, కొవ్వూరి చిన సత్యనారాయణ, భీమరాజు అప్పల కొండ, కర్రి శ్రీను, బద్రి, కోన శ్రీనివాసరావు, ఉద్దండం వెంకటేశ్వరరావు, గుర్రం నానాజీ, వెలగా శ్రీనివాసరావు, మధువర్మ, కోరెడ్డి సుబ్బారావు, కోరా జగదీష్, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



మిషన్ కుడుతున్న మహిళని ఓటు అడుగుతున్న కంబాల జోగులు



ప్రచారానికి వచ్చిన కంబాల జోగులుకు పండు ఇస్తున్న మహిళ



ఎమ్మెల్యే జోగులుకు పెనుగొల్లులో హారతులు పడుతున్న మహిళలు

సీతారాముల కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు



అరబుపాలెంలో సీతారాముల ఆలయం



ఆలయంలో సీతారాములు

మునగపాక : మండలంలోని అరబుపాలెంలో శ్రీరామ నవమి వేడుకలను ఈ నెల 17న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త బొడ్డేడ వెంకట సతీష్ తెలిపారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం ఎలా జరుగుతుందో అదే రీతిలో అరబుపాలెంలో కూడా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. 17 ఉదయం 9.30 గంటల నుంచి శ్రీరామచంద్రమూర్తి, సీతాదేవిల కల్యాణం నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అలాగే 19 ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి విశేష పూజలు, రాత్రి 8.15 గంటలకు స్వామివారి రథోత్సవం జరుగుతుందన్నారు. 22 రాత్రి 8 గంటలకు చోరోత్సవం (దొంగవిల్లి), 23 ఉదయం 9.30 గంటలకు నాగవల్లి (వసంతోత్సవం), 24 రాత్రి 8 గంటలకు పుష్పాంజలి శ్రీ పుష్పయాగం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులంతా తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకలను విజయవంతం చేయాలని సతీష్ కోరారు.

భక్తిశ్రద్ధలతో పెళ్లిరాట వేడుకలు..

మునగపాక : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మునగపాక దళితవాడ, అలాగే వాడ్రాపల్లి తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో పెళ్లిరాట వేడుకలు నిర్వహించారు. సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ నేతలు పిల్లి అప్పారావు, బీలా అప్పలనాయుడు, పెతకంశెట్టి రామజోగినాయుడు, భాస్కరరావు, లీలా భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.



మునగపాక దళితవాడలో సీతారాముల పెళ్లి రాట వేస్తున్న భక్తులు



దిమిలి రామాలయం వద్ద పెళ్లి రాట వేస్తున్న భక్తులు

దిమిలిలో..

రాంబిల్లి : దిమిలి గ్రామంలో సోమవారం రామాలయం వద్ద సీతారాముల కల్యాణం పెళ్లిరాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17న సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సీతారాముల సన్నిధిలో పూజలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, రామాలయం చైర్మన్ దొడ్డ లచ్చుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం ప్రారంభం



కొలువుదీరిన సీతారామ లక్ష్మణులు, ఆంజనేయస్వామి



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

రాంబిల్లి : వెంకటాపురంలో సోమవారం రామాలయం ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబు), డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ)తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యలమంచిలి : అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖాధికారి డి.రాంబాబు అన్నారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం యలమంచిలి పాత జాతీయ రహదారిపై అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ప్రజలు ఏ విధంగా జాగ్రత్తలు పాటించాలనే అంశంపై సిబ్బందితో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాటాకు ఇళ్లు, భవనాలు, ప్రైవేట్ పరిశ్రమల వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదాలు చోటు చేసుకుంటే తక్షణం తమకు సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఇంటింటి ప్రచారం



కాకివాని వీధిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ గోవింద్ తదితరులు



పాయకరావుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



అరబుపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

యలమంచిలి : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తాతో కలిసి సోమవారం ప్రచారం చేశారు. కాకివాని వీధిలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజు తరఫున ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రమణమూర్తిరాజును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గాన్ని అన్ని విధాలా ఎమ్మెల్యే కన్నబాబురాజు అభివృద్ధి చేశారన్నారు. అలాగే సీఎం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబంలో ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజలందరూ మద్దతు తెలిపి మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం..

పాయకరావుపేట : రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పార్టీ నాయకులు ప్రచారం చేశారు. పట్టణంలో గల పెదిరెడ్డినగర్, రాజుగారిబాడు ఏరియాలో జోరుగా ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా, మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పంచాయితీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించి ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగనన్ననే గెలిపించుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులును గెలిపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తు, అభ్యర్థుల ఫొటోలున్న బ్రోచర్లను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏస్సీ సెల్ నాయకుడు నెలపర్తి అర్జున్, పంచాయతీ వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్, పిరాది రాజు, జగతా శ్రీను, నాయకులు డి.సుందర్రావు, నెలపర్తి నాగరాజు, కొశిరెడ్డి నాగేశ్వరరావు, కేశనకుర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అరబుపాలెంలో..

మునగపాక: అరబుపాలెంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, యువజన విభాగం నేత బొడ్డేడ బుజ్జిలు ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా పేదలకు న్యాయం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తి రాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలునాయుడు, లంబా అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టాపర్‌గా నిలిచిన విద్యార్థి పూజితను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రచారంలో.. సత్కారం

ఎస్.రాయవరం : గ్రామీణ ప్రాంతంలో చదివిన విద్యార్థి కార్పొరేట్ ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని పాయకరావుపేట సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. పెనుగొల్లు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటర్‌లో మూడు మండలాలకు టాపర్‌గా నిలిచిన ఇసరపు పూజితను అభినందించి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. పూజిత అడ్డురోడ్డు గాయత్రి కళాశాలలో చదివి 470 కి 461 మార్కులు తెచ్చుకుని ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లో టాపర్‌గా నిలిచింది. ప్రచారంలో ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ విద్యార్థినిని అభినందించారు. మరింత బాగా చదివి ప్రయోజకురాలివి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాబి, సూర్యనారాయణ, చినసత్యనారాయణ, సర్పంచ్ నాగ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పీవో, ఏపీవోలకు శిక్షణ

పాయకరావుపేట : మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవోలకు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో సోమవారం శిక్షణ నిర్వహించారు. మంగళవారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో పీవో, ఏపీవోల విధులు, బాధ్యతల గురించి శిక్షణలో అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో గల పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకుగాను 772 మంది సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తున్నారు. సోమవారం 385 మందికి, మంగళవారం 392 మందికి శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 4 మండలాలకు చెందిన మండల తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులుతో పాటు మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహిస్తున్న ఆర్‌వో గీతాంజలి

21న పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్లో ఈ నెల 21న 6వ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షకు సంబంధిత విద్యార్థులు సకాలంలో హాజరు కావాలన్నారు. అలాగే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ పరీక్ష 5వ తరగతి స్థాయిలో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

రక్తదానం చేసి.. ప్రాణాలు కాపాడాలి

అనకాపల్లి : ఆరోగ్యవంతులైన యువతీ, యువకులు రక్తదానం చేసి ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఎన్టీఆర్ వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ వైద్యురాలు కనకదుర్గ అన్నారు. స్థానిక వైద్యాలయం ఆవరణలో సోమవారం 15 మంది వైద్య సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 నుంచి 60 ఏళ్ల వయసు గల ఆరోగ్యకరమైన వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల గుండెకు సంబంధించిన వ్యాధులతోపాటు వివిధ రకాల రోగాల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. ఆస్పత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్నన్న ఆస్పత్రి సిబ్బంది

మంచి నీటి బోరు ప్రారంభం

అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం దుర్గమ్మ ఆలయం వద్ద మంచి నీటి బోర్‌ను సచివాలయ సమన్వయకర్త చిన్ని శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. తన తండ్రి నర్సింగరావు జ్ఞాపకార్థం రూ. 75 వేలతో ఈ బోరు నిర్మించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్ని కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్న సత్యారావు, పందల శ్రీను, పల్లి శ్రీను, చిన్న ధనుంజయ్‌రావు, చిన్ని రమణ, చిన్ని రామునాయుడు, గంగిరెడ్డి నాగేశ్వరరావు, రెడ్డి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



బోరు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

అనాథలకు ఆహార పొట్లాల పంపిణీ



రోడ్డుపై అనాథలకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న సభ్యులు

రావికమతం: కొత్తకోట గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫర్ పూర్ పీపుల్ సంస్థ సభ్యులు సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకూ రోడ్డుపై అనాథలకు, వృద్ధులకు, మతిస్థిమితం లేని అభాగ్యులకు దారిపొడవునా వీటిని అందించారు. పలు గ్రామాల్లో కుటుంబీకులు దూరమైన అభాగ్యులకు భోజనంతోపాటు దుప్పట్లు, రగ్గులు అందజేశారు. ఆ సంస్థ నిర్వాహకులు విరోతి ఆనంద్, కె.శ్రీనివాసరావు, జె.రాజా, గట్రెడ్డి నాగేశ్వరరావు, మరో పది మంది సభ్యులు నాలుగు నెలలుగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపడుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

మోదీ పాలనలో వ్యవస్థలు కుదేలు

అనకాపల్లి: మోదీ పాలనలో దేశంలో అన్ని వ్యవస్థలు తీవ్ర స్థాయిలో నష్టపోయాయని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు మనోజ్ చౌహాన్ విమర్శించారు. స్థానిక నాయుళ్ల వీధిలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. దేశంలో అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని మోదీ కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే దిశలో మోదీ శతవిధాలా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్, ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రజామోదం గల మేనిఫెస్టోను తమ పార్టీ విడుదల చేసిందన్నారు.

వారపు సంతపై ఎండ ప్రభావం

మాడుగుల: స్థానిక వారపు సంతపై ఎండ ప్రభావం చూపింది. కొన్ని రోజులుగా తీవ్రంగా కాస్తున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వారపు సంతకు కొనుగోలుదారులు రాక చింతపండు అమ్ముడుపోలేదు. 50 కిలోల కావిడి చింతపండు గత వారం రూ.1,600 ఉండగా, ఈ వారం రూ.800కు పడిపోయింది. ఇంతవరకు ఉదయం 10 గంటలకే చింతపండు అమ్ముడుపోయేది. కొందరు గిరి రైతులు చింతపండు అమ్ముడుపోక తిరిగి స్వగ్రామాలకు తీసుకుపోయారు. అలాగే ఇతర సరకుల పరిస్థితి కూడా అలాగే ఉందని గిరి రైతులు వాపోయారు. 20 కిలోమీటర్ల దూరం నుంచి సంతకు వచ్చినా ఖర్చులు రాలేదని, ఎటువంటి గిట్టుబాటు దక్కలేదని వెనుదిరిగారు.